# 101. భక్తి బహురూపి

పన్నెండేళ్ల కిందట ఒకనాడు నేను ఆంజనేయస్వామి గుడిలోంచి ఇవతలికొస్తూ ఉండగా సింహద్వారం దగ్గర నన్ను దాటుకుంటూ వెళ్లాడు, జగ్గారావు. రెండడుగులు వేసి వెనక్కి తిరిగి చూసి "మీరా, మేష్టారూ; ఎవరో అనుకున్నాను!" అని రెండు చేతులూ జోడించి దండం పెట్టేడు. నా చేతిలో ఉన్న పుస్తకం అందుకుని; "యోగవాశిష్ఠము" అని పలికి, మళ్ళీ వెంటనే నాకిచ్చేసేడు. "ఏంటో ఈ పురాణాలూ శాస్త్రాలూ ఇలా వెర్రిగా చదువుతారు. టైమ్ వేస్ట్" అన్నాడు.

"మరి నువ్వు గుడికి రావడం కొబ్బరికాయ కొట్టడం ఇవన్నీ డబుల్ వేస్టు కాదా?"

"దానికీ మీరే కారణం. ఇవాళ నాన్న మీకు ఫోన్ చేస్తే నేను మెట్రిక్ ఫస్ట్ క్లాస్‌లో పాసైనట్టు రేపటి వార్త ఇవాళే చెప్పేరుటగా, అందుకని నాన్న తరిమితే వచ్చాను"

"చెప్పింది నేనే, తరిమింది మీ నాన్నే అయినా పరీక్ష పాసైంది నువ్వే, కొబ్బరికాయ కొట్టింది నువ్వే - భక్తుడివయింది నువ్వే." అని నేను వేళాకోళం చెయ్యగానే పిల్లాడు బుర్రగోక్కుని వెళ్ళిపోయాడు.

ఆ తరువాత రెండేళ్ళకి నేను కుటుంబంతో సహా తిరుపతి యాత్రకెళ్ళినప్పుడు అన్నమాచార్యుల వారి విగ్రహం దగ్గిర మా అమ్మాయి కుతూహలంగా అడిగిన ప్రశ్నలకి జవాబులు చెప్తుండగా అల్లంత దూరంలో కనిపించేడు, జగ్గారావు. అతను గుండు కొట్టించుకుని వుండడం వల్ల వెంటనే గుర్తు పట్టలేకపోయాను గాని; అతను బేరం చేసిన టోపీ నెత్తిమీద పెట్టి ట్రయి చేసుకుంటూ ఉన్న క్షణంలో గుర్తు పట్టేశాను. "ఏయి, జగ్గారావ్" అని కేక పెట్టేసరికి ఇటు తిరిగేడు. నెత్తిమీదున్న టోపీ ఇచ్చేసి, చేతిలో ఉన్న సిగరెట్టు పారేసి కంగారుగా వచ్చేడు.

"ఏమిటి, సంగతి?" అన్నాను.

జగ్గారావు బోలెడు సంజాయిషీ చెప్పేడు, చిన్న కథ కూడాను.

ఇంటర్మీడియెట్ పరీక్ష ఎం.పి.సి. గ్రూపుతో ఫస్టు క్లాసులో పాసయ్యేడుట. రిజల్టు మూడు రోజుల కిందట పేపర్లో చూడగానే వాళ్ళమ్మ అర్జంటుగా తిరుపతి వెళ్లి గుండు కొట్టించుకురమ్మని పంపిందట. "నాకిలాంటి పన్లమీద నమ్మకం లేదు, మీకు తెలుసుగా మేష్టారూ, అమ్మ నాలుగు వందల రూపాయలిచ్చింది కదా, రాజమండ్రిదాకా వచ్చి నా ఫ్రెండ్స్‌తో మూడు రోజులు గడిపేద్దామనుకున్నాను. వెళ్ళేటప్పుడు ఏదైనా సెలూన్‌లో గుండు కొట్టించుకుపోతే పనైపోతుందను కున్నాను. కానీ మా అమ్మ నా ప్లానంతా పాడు చేసింది. నా ఎదురుగానే ఫోన్ తీసి కింది తిరుపతిలో ఉన్న నారాయణమూర్తి గారితో మాట్లాడింది. మా అబ్బాయి ఇలా యిలాగా తిరుపతి వస్తున్నాడు. మీ ఇంట్లోనే దిగుతాడు; దరిసెనం అదీ సక్కగా చేయించి ప్రది లడ్డూలు కొనిపించి పంపించండీ-అని, మీ అమ్మాయి కూడా ఇంటర్ ఫస్ట్ క్లాసులో పాసైందా?"

"పాసైంది గాని గుండు కొట్టించుకోదు" అన్నాను.

"ఛీ అదేంటి మాస్టారూ, అలా అంటారు?" అని నొచ్చుకున్నాడు. దాంతో ఇతను బిలీవరా నాన్ - బిలీవరా అన్నది తేలక నేను ఊరుకున్నాను. జగ్గారావు నన్ను పక్కకి లాక్కెళ్లి "సిగరెట్ కాల్చేనని నాన్నగారితో చెప్పకండి ప్లీజ్".

ఇంజినీరింగ్‌లో సీటొస్తే మళ్ళీ తిరుపతి పంపిస్తానని వాళ్లమ్మా నాన్నా మొక్కుకున్నారు గానీ, జగ్గారావు బి.ఎస్సి. లోనే చేరవలసొచ్చింది. అయితే అనకాపల్లి నూకాలమ్మ దయవల్లనో కంచరిపాలెం పైడిమాంబ దయవల్లనో తెలియలేదు గానీ, బి.ఎస్సిలో వచ్చిన సీటు కంప్యూటర్ సైన్సులో వచ్చినందువల్ల ఇద్దరు అమ్మవార్లకీ పట్టుచీరలు చూపించి చెరి వెయ్యినూట పదహారు గ్రాముల కుంకుమతోనూ అర్చన చేయించేరు.

జగ్గారావు బి.ఎస్సి. మూడో ఏడాదిలో వుండగా వాళ్ల పేటలో అంతకుముందే ఉన్న ఒక భక్తి సమాజానికి అతగాడు ప్రెసిడెంటుగా ఎన్నికయ్యాడు. జగ్గారావు ముఠావారు ఆ ఏడాది మున్సిపాల్టీవాళ్లు పన్నులు పెంచినట్లుగా చందారేట్లు ఘనంగా పెంచేరు. శివరాత్రి నుంచి సంకురాత్రి వరకూ వచ్చే పండుగలన్నిటి సందర్భంగానూ నవరాత్రులు నవనవలాడుతూ నిర్వహించే ఆ ముఠా (అదే, భక్త బృందం) ఆయా నవరాత్రుల్లో ఒకరోజు హరికథా, ఒకరోజు పురాణ కాలక్షేపం, ఒకరోజు సినిమా ప్రదర్శనా ఏర్పాటు చేసినా మిగతా ఆరు రాత్రులూ రికార్డింగ్ డాన్సులు పెట్టి భక్తుల (చందాదార్ల) అభిమానాన్ని చూరగొనడం విశేషం.

"మావాడు చిన్నప్పుడంతా దేవుడూ నై - పురాణాలూ నై - అంటూ తిరిగినా ఇప్పుడు గొప్ప భక్తుడైపోయాడు. వాణ్ణి భక్తిమార్గంలోకి మళ్ళించింది నువ్వే" అన్నాడు రమణయ్య.

"రోజూ పూజలూ అవీ చేస్తాడా?"

"అబ్బో! వాడు మొక్కని దైవం లేడిప్పుడు. రాముడు, కృష్ణుడు, వెంకటేశ్వరస్వామి, జగన్నాథస్వామి, ఆంజనేయస్వామి, గణపతి, శివుడు, వీళ్లతో పాటు కనకమాలక్ష్మి, నూకాలమ్మ, పైడి తల్లమ్మ ఇలా ఎవరి క్కొట్టవలసిన కొబ్బరికాయలు వారికి పద్ధతిగా కొడ్తాడు. మా పెరట్లో ఆ పన్నెండు కొబ్బరి చెట్లూ లేకపోతే నా సంపాదనంతా కొబ్బరి కాయలకే ఖర్చయిపోయి వుండేది!"

జగ్గారావు కంప్యూటర్ సైన్సుతో ఎమ్మెస్సీ పాసయినట్లు తెలిసిన తరువాత ఒక వారానికి అతనూ, ఇద్దరు స్నేహితులూ అన్నవరం కొండమీద గెస్టుహౌసులో ఆనందపు లోతులూ అనురాగపు అంచులూ చూస్తూ రెండు రోజులు గడపడం నా దృష్టిలో కొచ్చి, అతనికి పెళ్లి చేసెయ్యమని రమణయ్యకి సలహా చెప్పేను. పి. అండ్ టి. కంపెనీలో కంప్యూటర్ మెయింటెనెన్స్ ఇంజనీర్ ఉద్యోగం వచ్చిన సందర్భంగా సత్యనారాయణ వ్రతం చేయించడానికి జగ్గారావు అన్నవరం వెళ్లేడట. "ఏ వ్రతం చేసినా ధర్మపత్నీ సమేతంగా చెయ్యడం మంచిది కదా" అన్నాను నేను; ఆ అబ్బాయి తనతో ఎవర్ని తీసికెళ్ళేడో చెప్పకుండానే.

మొన్న పదిహేడో తారీకునాడు హైదరాబాదులో జరిగిన ఒక కాన్ఫరెన్సుకి నేనూ ఇంకో ప్రొఫెసరు గారూ వెళ్ళినప్పుడు ఆ కాన్ఫరెన్సుని 'స్పాన్సర్' చేసిన పి. అండ్ టి. కంపెనీ తరపున ఏర్పాట్లు చేస్తూ కనబడ్డాడు జగ్గారావు. మొహాన పెద్దకుంకుమ బొట్టుతో, సాయిబాబా, వెంకటేశ్వరస్వామి ఉంగరాలతో గొప్ప హుందాగా కనిపించాడు.

"అంతా మా ఎమ్.డి గారి ప్రభావం. ఆయన రోజూ గంటసేపు పూజచేస్తే గాని ఆఫీసుకి రారు. అంచేత మాకు బొట్టు కంపల్సరీ అయిపోయింది" అన్నాడు జగ్గారావు. వాళ్ల ఎమ్.డి. ప్రకాశ్ గారు అన్ని పురాణాలను, శాస్త్రాలను, దర్శన, వ్యాకరణ, మీ మాంసాది విషయాలను అవలోడనం చేసి భక్తి మార్గం వ్యక్తికి, కర్మమార్గం సమాజానికీ వెలుగు అని నమ్మినవాడు. ఇప్పుడైనా జగ్గారావు దారికొస్తాడు కదా అని సంతోషించాను.

★